క్లుప్తంగా

ఆత్మీయ కలయిక



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఎంపీటీసీ గంటా శ్రీనివాసరావు

భీమడోలు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని పార్టీ కేంద్రం కార్యాలయంలో పూళ్ల ఎంపీటీసీ గంటా శ్రీనివాసరావుతో పాటు కురెళ్ల గూడెం, కోడూరుపాడు పార్టీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఒకొక్కరినీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆప్యాయంగా పలికరించారు. పార్టీ పటిష్టతకు మరింత కృషి చేయాలని, శ్రేణులకు తాను అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారని, చాలా సంతోషంగా ఉందని నాయకులు తెలిపారు. స్థానిక పార్టీ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారని, ఆయన చూపిన అభిమానం మరవలేనిదని వారు తెలిపారు.

దేవుని ఆజ్ఞలకు అనుగుణంగా జీవించాలి



దీవెనల పండుగలో మాట్లాడుతున్న పాస్టర్ విలియం

దెందులూరు: కొవ్వలి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్లో మంగళవారం బెతస్థ ప్రార్థన మందిరం పాస్టర్ పండుగల నిర్వాహకులు సీహెచ్ విలియం ఆధ్వర్యంలో దీవెనల పండుగలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన గుడివాడ సువార్తికులు జార్జ్ బుష్ మాట్లాడుతూ దేవుని ఆజ్ఞలను ప్రతి ఒక్కరూ నిబద్ధతతో అనుసరిస్తూ జీవించాలన్నారు. మోక్ష మార్గం, సేవా తత్వం, ప్రేమ, ఆదరణ, నిరంతర, ప్రార్థనతోనే దేవుని దీవెనలు లభిస్తాయన్నారు. నిర్వాహకులు బెతస్థ ప్రార్థన మందిరం చర్చి పాస్టర్ సీహెచ్ విలియం మాట్లాడుతూ దేవుని ఆజ్ఞలకు అనుగుణంగా దైవ సేవకుల ఆధ్యాత్మిక సూచనలు సలహాలను పాటించాలన్నారు. ఏలూరు, దెందులూరు, భీమడోలు, పెదపాడు, పెదవేగి మండలాల నుంచి విశ్వాసులు హాజరయ్యారు.

గ్రామాల్లో ముమ్మరంగా 'పొలం పిలుస్తోంది'



పెదవేగి మండలంలో పొలం పిలుస్తోంది నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

పెదవేగి : అమ్మపాలెం, దుగ్గిరాల గ్రామాల్లో వ్యవసాయశాఖాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం రైతుల సమక్షంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ వారి ద్వారా ప్రతి రైతుకి ఒక విశిష్ట సంఖ్య ఇవ్వాలనే ఉద్దేశంతో రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇకపై ఏ ప్రభుత్వ పథకం వర్తించాలన్నా విశిష్ట సంఖ్య ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు ఎం ప్రియాంక, రత్నమాల, కుమారి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చిలకా నాగరాజుకు ఉత్తమ లైన్‌మేన్ అవార్డు



నాగరాజును సత్కరిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

దెందులూరు: అన్ని శాఖల్లో విద్యుత్ శాఖ కీలకమైందని సంస్థ లక్ష్యాలకు అనుగుణంగా వినియోగదారులకు సకాలంలో సంతృప్తికరమైన సేవలు అందించిన గోపన్నపాలెం విద్యుత్ శాఖ లైన్‌మేన్ చిలకా నాగరాజు అభినందనీయులని ఆ శాఖ డివిజనల్ ఇంజనీర్ అంబేడ్కర్ అన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో చిలక నాగరాజుకు ఉత్తమ లైన్‌మేన్‌గా అవార్డును, ప్రశంస పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏడీఈ శ్రీనివాస్, దెందులూరు ఏఈ శ్రీనివాస్ ఉన్నారు.

ప్రజాసమస్యలపై పీడీఎఫ్ పోరాటం

భీమడోలు: ఉద్యోగులు, నిరుద్యోగులు, కార్మికులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, స్కీమ్ వర్కర్ల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పీడీఎఫ్ కృషి చేస్తున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు అన్నారు. భీమడోలులోని పలు విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మంగళవారం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులుకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఆయన విస్తృత ప్రచారం చేసారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ పాల్గొన్నారు.

క్లస్టర్ సమావేశాల నిర్వహణపై కసరత్తు

- ప్రతి నెలా 3వ శనివారం మధ్యాహ్నం సమావేశం
- ఆరోజు రెండవ పూట పాఠశాలలకు సెలవు
- ఉపాధ్యాయులందరూ హాజరు కావాలని ఆదేశాలు
- విద్యా సంబంధిత ప్రగతి, సమస్యలపై చర్చ



క్లస్టర్‌గా ఎంపికైన గణపవరం బాలుర ఉన్నత పాఠశాల

గణపవరం: విద్యావ్యవస్థలో ఇప్పటి వరకూ ప్రతి నెలా నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ (పాఠశాల సముదాయాలు) సమావేశాల స్థానంలో కొత్తగా ఏర్పాటు చేసిన క్లస్టర్ సమావేశాలు నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు. ప్రతి నెలలో 3వ శనివారం ఈక్లస్టర్ సమావేశాలు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ మంగళవారం నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో ప్రకటించారు. నెలలో మూడవ శనివారం ఒక పూట మాత్రమే పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకూ క్లస్టర్ సమావేశాలు నిర్వహించనున్నారు. దీని కోసం ఆరోజున ఉదయం 11.45 గంటలకే విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పెట్టి ఇళ్లకు పంపించాలి. రెండో పూట విద్యార్థులకు సెలవుగా ప్రకటించారు. మధ్యాహ్నం పూట ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా క్లస్టర్ సమావేశాలకు హాజరు కావాలి.

క్లస్టర్ మీటింగ్ నిర్వహించే రోజు ఉపాధ్యాయులు అసాధారణ పరిస్థితులు, ఆరోగ్యపరమైన సమస్యలుంటే తప్ప సాధారణ సెలవులు పెట్టుకోవడానికి వీలులేదు. ఒకవేళ మూడో శనివారం ప్రభుత్వ సెలవు అయితే తదుపరి నాలుగో శనివారం క్లస్టర్ సమావేశం నిర్వహించాలి. క్లస్టర్ సమావేశాలకు హాజరైన ఉపాధ్యాయులంతా తప్పని సరిగా అక్కడే బయోమెట్రిక్ హాజరు వేయాల్సి ఉంటుంది.

మండలం	మొత్తం పాఠశాలలు	ఏర్పాటైన క్లస్టర్లు
గణపవరం	48	03
నిడమర్రు	33	03
ఉంగుటూరు	56	04
భీమడోలు	37	03

సమావేశంలో స్ట్రాంగ్ టీచర్లు

- క్లస్టర్ సముదాయ పాఠశాలలో ఇద్దరు చురుకైన, మంచి బోధనా సామర్థ్యం, వనరులు కలిగిన సెకండరీ గ్రేడు ఉపాధ్యాయులు ఇద్దరు (స్ట్రాంగ్ టీచర్లు) ఉంటారు. 1, 2 తరగతులకు ఒక స్ట్రాంగ్ టీచరు, 3,4,5 తరగతులకు ఒకరు, హైస్కూలు స్థాయిలో 6 నుంచి 10 తరగతుల వరకూ ఒక్కో సబ్జెక్టుకు ఒక స్ట్రాంగ్ టీచరు, ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు ఒక స్ట్రాంగ్ టీచరు మొత్తం 8 మంది స్ట్రాంగ్ టీచర్లను ఎంపిక చేసుకుని సిద్ధంగా ఉండాలి.

ఐఎఫ్‌పీలు, అంతర్జాలంతో సిద్ధంగా ఉంచాలి

- క్లస్టర్ సమావేశాలు నిర్వహించే పాఠశాలల్లో అన్ని ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ)లు పనిచేసే స్థితిలో ఉండాలి. ఆ పాఠశాలలో ఇంటర్నెట్ (అంతర్జాల) సదుపాయం ఖచ్చితంగా అందుబాటులో ఉండేలా చూడాలి.

కాలనిర్ణయ పట్టిక ఇలా

- వచ్చే మూడో శనివారం నిర్వహించే క్లస్టర్ సమావేశం మధ్యాహ్నం 1 గంటకు ప్రారంభమవుతుంది. 1.30 గంటల వరకూ విద్యాశాఖ మంత్రి, పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి, విద్యాశాఖ కమిషనర్ సందేశాలు ఉంటాయి.
- 2 నుంచి 2.30 గంటల వరకూ ఎస్జీటీలు, స్కూలు అసిస్టెంట్లు ఉమ్మడి సమావేశం నిర్వహించాలి.
- 2.30 నుంచి 3.45 గంటల వరకూ 1,2 తరగతులు బోధించే ఉపాధ్యాయులు ఒక గదిలో, 3,4,5 తరగతులు బోధించే ఉపాధ్యాయులు మరొక గదిలో, వేర్వేరు సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులంతా వేర్వేరు గదుల్లో సమావేశమై బోధనాంశాలకు సంబంధించిన విషయాలపై గ్రూపు చర్చలు నిర్వహించాలి. సిలబస్, పరీక్షా పత్రాల మూల్యాంకనం, ఎఫ్ఎల్ఎన్ ప్రకారం విద్యార్థుల స్థితి, ఎస్ఎస్‌సీ యాక్షన్ ప్లాన్, మోడల్ పాఠ్యాంశ బోధన విషయాలపై చర్చించాలి.
- 3.45 గంటల నుంచి 4 గంటల వరకూ విరామం
- 4 నుంచి 4.30 గంటల వరకూ మొత్తం ఉపాధ్యాయులంతా ఉమ్మడిగా సమావేశమై అత్యుత్తమ అభ్యాసాలపై చర్చించాలి.
- 4.30 నుంచి 5 గంటల వరకూ విద్యాశాఖ కమిషనర్‌తో పరస్పర చర్చా కార్యక్రమం జరుగుతుంది.
- సాయంత్రం 5 గంటలకు క్లస్టర్ సమావేశం ముగుస్తుంది.

విస్తృతంగా తనిఖీలు

అన్ని క్లస్టర్ సమావేశాలు నిర్వహించే పాఠశాలలను విద్యాశాఖ ఉన్నతాధికారులంతా తప్పనిసరిగా తనిఖీలు చేయాలని కమిషనర్ ఆదేశించారు. డీఈవో, డీవైఈవో, ఎంఈవో, సమగ్ర శిక్ష ప్రాజెక్టు కోఆర్డినేటర్, సెక్టోరియల్ అధికారుల ఖచ్చితంగా క్లస్టర్ సమావేశాలను సందర్శించాలి. ఉంగుటూరు నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో మొత్తం 174 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిని గతంలో 21 కాంప్లెక్సులుగా ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించే వారు. వీటి స్థానంలో ప్రస్తుతం కొత్తగా 13 క్లస్టర్లు ఏర్పాటయ్యాయి.

మధ్యాహ్న భోజనాన్ని రుచిగా సిద్ధం చేయాలి



పూళ్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ

భీమడోలు: పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.వెంకటలక్ష్మమ్మ ఆకస్మిక తనిఖీ చేసారు. పాఠశాలలో తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని చిన్నారులతో కలిసి ఆమె రుచి చూశారు. మరింత నాణ్యతగా, రుచిగా వండి, విద్యార్థులకు అందించాలని ఎండీఎం నిర్వాహకులకు ఆమె సూచించారు. పాఠశాలలో ప్రతి రోజు మధ్యాహ్న భోజనం నాణ్యతపై బాలబాలికలను అడిగి తెలుసుకున్నారు. పోషక విలువలు గల ఆహారాన్ని అందిస్తున్నందున ప్రతి ఒక్కరూ తినాలని విద్యార్థులకు సూచించారు. తొలుత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి ప్రీ పబ్లిక్ పరీక్షల నిర్వహణను ఆమె పరిశీలించారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు పాఠశాల నుంచి 103 మంది రాస్తున్నాయని హెచ్ఎం పెనుగొండ భువనేశ్వర రావు డీఈవోకు వివరించారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని హెచ్ఎంను కోరారు. పాఠశాలకు సంబంధించిన పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. తొలుత గణిత ల్యాబ్‌ను పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులను దత్తత తీసుకున్న ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి, వారంతా ఉత్తీర్ణతా సాధించేలా కృషి చేయాలని డీఈవో టీచర్లకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎండీఎం సిబ్బంది పాల్గొన్నారు.

అచ్చమ్మ పేరంటాలు తల్లికి పూజలు

దెందులూరు: గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలు తల్లి సన్నిధిలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏలూరు విజిలెన్స్ డీఎస్పీ మేకా సుధాకర్ కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అచ్చమ్మ పేరంటాలు తల్లి 68వ ఆలయ ఉత్సవాల్లో భాగంగా ఆల య కమిటీ సభ్యులు, అర్చకులు డీఎస్పీ కుటుంబానికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శేష వస్త్రాన్ని అందజేశారు. గాలాయగూడెం కోఆపరేటివ్ సొసైటీ మాజీ చైర్మన్ తోట అచ్చయ్య, తోట అశోక్ ఆర్థిక సహాయంతో అమ్మవారికి చీరలతో ప్రత్యేక అలంకరణ చేశారు.

తగ్గని పొగ మంచు తీవ్రత



భీమడోలులో మంచులోనే ఆడుతున్న చిన్నారులు

భీమడోలు: మంచు తెరలు వీడడం లేదు. ఉదయం వేళ దట్టంగా పొగ మంచు కురుస్తోంది. జాతీయ, రాష్ట్రీయ రహదారులపై వాహన చోదకులు వెలుతురు కోసం లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ఓ పక్క ఎండ తీవ్రత పెరుగుతున్నప్పటికీ ఉదయం వేళల్లో మంచు కురుస్తోంది. మండల వ్యాప్తంగా భీమడోలు, గుండుగొలను, పూళ్ల గ్రామాల్లో మంగళవారం ఉదయం 8 గంటలకు మంచు వీడకపోవడంతో పనుల కోసం వెళ్లే కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు పాఠశాలల ప్రాంగణాల్లో ఆటలు ఆడుకునేందుకు ఉదయాన్నే వెళ్లే చిన్నారులు, యువకులు సైతం మంచులో తడిసి ముద్దవుతున్నారు. మంచు ప్రభావంతో వారంతా అనారోగ్యం బారిన పడుతున్నారు. ఉదయం కాలినడక నడిచే వృద్ధులు సైతం అనారోగ్యం బారిన పడుతున్నారు. ఉదయం మంచు.. మధ్యాహ్నం ఎండ తీవ్రత రోజు రోజుకూ పెరిగిపోతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈనెలాఖరు వరకు మంచు కురుస్తూనే ఉంటుందని పలువురు అంటున్నారు. సీజన్ మారుతున్న వేళ ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు. మంచు వల్ల పంటలపై తెగుళ్ల సోకే అవకాశాలుంటాయని వ్యవసాయ శాఖ సిబ్బంది అంటున్నారు.

సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవాన్ని ఫిబ్రవరి 11న 180 దేశాలు పాటిస్తున్నాయని నేషనల్ ఇన్ఫార్మెటిక్స్ సెంటర్ డీఐఓ భానుప్రకాష్ అన్నారు. మంగళవారం స్థానిక సీఆర్ రెడ్డి కళాశాలలో నిర్వహించిన సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవంలో భానుప్రకాష్ మాట్లాడారు. మెరుగైన ఇంటర్నెట్ కోసం డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణకు 2025 ముసాయిదాను భారత ప్రభుత్వం జనవరిలో విడుదల చేసిందని తెలిపారు. తద్వారా వ్యక్తిగత సమాచార గోప్యత పౌరుల ప్రాథమిక హక్కుగా గుర్తిస్తారని చెప్పారు. అభ్యంతరకర సమాచారం, చిత్రాలు, వీడియోలను ఇంటర్నెట్ ఆన్‌లైన్ నుంచి తొలగించమని కోరే హక్కును డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణ చట్టం 2023 సెక్షన్-12(3) కల్పిస్తుందని వివరించారు. ప్రిన్సిపాల్ కేఏ రామరాజు, కరస్పాండెంట్ కేఏస్ విష్ణుమోహన్, కో-ఆర్డినేటర్ ఏడీఐఓ సుజాత పాల్గొన్నారు.

పవిత్ర జీవనం గడపాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మేరీమాత పవిత్ర కన్య అని, విశ్వాసులంతా ఆమెలా జీవనం గడపాలని నూజివీడు విచారణకర్త ఫాదర్ లాము జయరాజు అన్నారు. స్థానిక గ్జేవియర్ నగర్‌లోని అమలోద్భవి మాత కథీడ్రల్ చర్చి వార్షికోత్సవాలు, లూర్దుమాత పండుగల మూడో రోజు కార్యక్రమాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమలోద్భవి కథీడ్రల్ విచారణకర్త ఫాదర్ ఇంజమాల మైఖేల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడకల్లో సెయింట్ జోసఫ్ డెంటల్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ మాట్లాడుతూ విశ్వాసులు ఒకరిపట్ల ఒకరు ప్రేమ కలిగి జీవించాలని అన్నారు. సెయింట్ ఆన్స్ కాన్వెంట్ నుంచి లూర్థుమాత స్వరూపంతో అమలోద్భవి కథీడ్రల్ వరకు తేరు ఊరేగింపు నిర్వహించారు. ప్రత్యేక అతిథి ఫాదర్ లాము జయరాజును ఘనంగా సత్కరించారు. ఫాదర్ బి.రాజు, ఆర్ మరియ జోజి పాల్గొన్నారు.

సీతారామయ్య సేవలు మరువలేనివి



నాగులదేవునిపాడులో ముసునూరి సీతారామయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: ముసునూరి సీతారామయ్య రైతుల సమస్యలపై దశాబ్దాలుగా చేసిన పోరాటాలతో పాటు వైఎస్సార్‌సీపీ అందించిన సేవలు మరువలేనివని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం నాగులదేవునిపాడులో ఇటీవల మృతి చెందిన ముసునూరి సీతారామయ్య ఇంటికి వెళ్లి ఆయన కుమారులు ముసునూరి వెంకటేశ్వరరావు, శివను అబ్బయ్య చౌదరి పరామర్శించారు. సీతారామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సర్పంచ్ చిలకా వెంకటసుబ్బారావు, నాయకులు బోయపాటి గణేష్, మొటపర్తి గాంధీ ఉన్నారు. సానిగూడెంలో ఇటీవల మృతి చెందిన జంగం రాజేష్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను అబ్బయ్యచౌదరి పరామర్శించారు. బాధిత కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. ముందుగా రాజేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే గ్రామంలో ఇటీవల మృతి చెందిన కొరపాటి రామకృష్ణ ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇటీవల మృతి చెందిన నల్లమిల్లి అరుణ ఇంటికి వెళ్లి ఆమె కుటుంబ సభ్యులను అబ్బయ్యచౌదరి పరామర్శించారు. అరుణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధైర్యంగా ఉండాలని మృతుల కుటుంబాలకు సూచించారు. ఆయన వెంట సర్పంచ్ సనిపల్లి రామకృష్ణ (విష్ణు), పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు ఫ్రాన్సిస్, కార్యకర్తలు ఉన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

నిడమర్రు: ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పీడీఎఫ్ బలపరిచిన డీవీ రాఘవులును గెలిపించాలంటూ సీఐటీయూ ప్రజా సంఘాల బృందం, యూటీఎఫ్ నాయకులు మంగళవారం ప్రచారం చేసారు. బాయిపాలెం, క్రొవ్విడి గ్రామాల్లోని స్కూల్స్, సచివాలయాల్లోని గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు వెయ్యాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారపల్లి రమణారావు బృందం కోరారు. ఈ కార్యక్రమంలో కోనశ్రీనివాసరావు, వెలగలేటి మోహన్, గవర సత్యనారాయణ, యూటీఎఫ్ నాయకులు ఉన్నారు.

గుర్తింపు సంఖ్య ద్వారా రైతులకు సంక్షేమ పథకాలు

పెదపాడు : ప్రభుత్వం చేపట్టిన రైతు రిజిస్ట్రేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని పెదపాడు వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్ తెలిపారు. పెదపాడు మండలంలోని కొక్కిరపాడు, వట్లూరులో రైతులతో సమావేశం నిర్వహించారు. రైతు నమోదు ద్వారా ప్రభుత్వం గుర్తింపు సంఖ్యను అందిస్తుందని, తద్వారా సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామని చెప్పారు. రబీ పంటకు సంబంధించి ఈ పంట నమోదు ఈకేవైసీ చేయించుకోవాలని రైతులకు సూచించారు. గ్రామంలోని రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలును విస్మరించిన ప్రభుత్వం



మాజీ ఎమ్మెల్యేను కలిసిన పార్టీ నాయకులు

దెందులూరు: వైఎస్సార్‌సీపీ నాయకులకు, కార్యకర్తలకు, బాధితులకు అండగా ఉంటానని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జోగన్నపాలెం వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కోఆపరేటివ్ సొసైటీ మాజీ చైర్మన్ పాకలపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు అబ్బయ్య చౌదరిని కలిశారు.జోగన్నపాలెంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నెలకొన్న పరిస్థితులను వివరించారు. ప్రభుత్వ పథకాలు రద్దు చేసేందుకు విచారణ పేరుతో ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. ఏడు నెలల్లోనే కూటమి ప్రభుత్వంపై ప్రజలకు తీవ్ర వ్యతిరేకత, అసంతృప్తి వచ్చిందన్నారు. అన్ని పరిస్థితులను ప్రజలందరూ గమనిస్తున్నారని ఎన్నికల హామీలను విస్మరించిన వారికి గుణపాఠం తప్పదని కొఠారు అన్నారు. పార్టీ శ్రేణులు ధైర్యంగా ఉండాలని కొఠారు సూచించారు.

అబాకస్‌లో వేదాక్షిత ప్రియ ప్రతిభ

దెందులూరు: రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో దెందులూరు సెయింట్ మేరీస్ ఇంగ్లీష్ మీడియం యూపీ పాఠశాల ఏడో తరగతి విద్యార్థిని వేదాక్షిత ప్రియ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది. విజయవాడ మనం కల్యాణ వేదికలో ఎడ్యుటెక్ సంస్థ నిర్వహించిన రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో ప్రియ విజయం సాధించటం సంతోషంగా ఉందని ప్రిన్సిపల్ సిస్టర్ టీనా మరియ అన్నారు. విద్యార్థిని ప్రియను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

అలరించిన కూచిపూడి నృత్యాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో 93వ వార్షిక రామకోటి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం విశ్వశాంతి సమాజం సభ్యుల ఆధ్వర్యంలో మౌన ధ్యానం, భక్తి గీతాలు, హరేరామ సంకీర్తనలు నిర్వహించారు. స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమం, నిత్య కల్యాణం నిర్వహించారు. నగరానికి చెందిన దుర్గా సప్తశతి బృందంచే పాదర్తి జ్యోతి ఆధ్వర్యంలో హనుమంతునికి మన్యుసూక్త పారాయణ చేశారు. హనుమంతునికి సామూహికంగా పానకంతో అభిషేకం, పూజలు చేశారు. మినీ సుందరకాండ పారాయణం, సువర్చలాదేవికి శ్రీ సూక్తంతో కుంకుమ పూజ, సౌందర్యలహరి పారాయణ చేశారు. సాయంత్రం ద్వారకామాయి భజన బృందం ఆధ్వర్యంలో భక్తి భజన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి నాట్య భారతి అకాడమీ ఆధ్వర్యంలో దివ్య సుహాసిని శిష్యబృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి.

బీటలు వారిన వరి పొలాలు

- జిల్లేడు దిబ్బ భూములకు అందని సాగునీరు
- కన్నీటి పర్యంతమవుతున్న రైతులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



బీటలు వారిన వరి పొలం

దెందులూరు: సాగునీరు అందక వరి పొలాలు బీటలువారుతున్నాయి. తగినంత నీరు వస్తే పొలాల్లోని పంటలు ఏపుగా పెరిగి సాగుకు పెట్టిన పెట్టుబడి, చేసిన అప్పులైన తీరతాయని అన్నదాతలు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. మండలంలోని కొవ్వలిలో మొండికోడు దిగువ జిల్లేడు దిబ్బ ప్రాంతంలో వందలాది ఎకరాల్లో సాగునీరు అందక పొలాలు బీటలు వారాయి. ప్రకృతి సహకరించక, ప్రభుత్వం నుంచి రైతు భరోసా తదితర పథకాలు అందించక రైతులు అవస్థలు ఎదుర్కొంటూ పంటలను సాగు చేస్తున్నారు. పొలాలకు సరపడా నీరు రాకపోవడంతో ఏం చేయాలో తెలియని దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

రైతు భరోసా అందక అన్నదాత కుదేలు

ప్రైవేటు వ్యక్తుల వద్ద వడ్డీలకు అప్పులు తెచ్చి పంటలపై పెట్టుబడి పెట్టామని వారంటున్నారు. గత ప్రభుత్వంలో సాగుకు ముందుగా పెట్టుబడి సాయం మంజూరు చేయడంతో కొంత భరోసా లభించేదని నేడు ఆ పరిస్థితులు లేకపోవడంతో కుదిలైపోయామని రైతులు వాపోతున్నారు. సన్న, చిన్న కారు రైతులు సాగు పనులు మొదలుపెట్టి నీరు వస్తుందని భావిస్తే ఇప్పుడు అవసరమైన జలాలు రాకపోవడంతో సమస్యను ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాని పరిస్థితిలో రైతులు ఉన్నారు. మరికొందరు రైతులు సాగునీరు అందక బీటలువారిన పొలాలను చూస్తూ కన్నీటి పర్యంతమవుతున్నారు. శివారు భూముల్లో సాగు చేస్తున్న రైతులు పరిస్థితి మరీ దారుణంగా ఉంది. వరి పొలాలు ఎండిపోయి బీటలు తీశాయి. ఇరిగేషన్ శాఖ అధికారులు ఆ విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి



సాగునీరు అందక వ్యవసాయ పొలాలు బీటలు వారడం బాధాకరం. జిల్లేడు దిబ్బ ప్రాంతంలో సాగునీరందని వ్యవసాయ పొలాలను అధికారులు పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. ఉన్నతాధికారులు స్పందించి బాధిత రైతులకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– కొఠారు అబ్బయ్య చౌదరి, మాజీ ఎమ్మెల్యే

సాగునీటి ఇబ్బందులను గుర్తించాం

దెందులూరు మండలం కొవ్వలి దిగువ జిల్లేడు దిబ్బ ప్రాంతంలో పొలాలకు సాగునీరు సరఫరా కాకపోవడంతో పొలాలు బీటలు వారాయని క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు తెలిపారు. కొవ్వలి వరకు క్రనాచు, జడ నాచు, మంచం కోళ్ల అడ్డుపడి సాగునీరు పూర్తిస్థాయిలో శివారు భూములను సరఫరా కావడం లేదు. సమస్యను డివిజన్ జిల్లా అధికారులతో కలిసి గుర్తించాం. త్వరలో చర్యలు తీసుకుంటాం.

– సుబ్రహ్మణ్యం, ఇరిగేషన్ జేఈ